RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 407 | 21 ఆదివారం జూన్ 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# భారత్ ధర్మసత్రం కాదు


## : అమిత్ షా వ్యాఖ్యలు

- చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు
- ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి దేశం నుంచి పంపిస్తామని స్పష్టీకరణ
- ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడుంటారని ఉద్ఘాటన



శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ ధర్మసత్రం కాదని, ఈ దేశం పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, వారిని వెళ్లగొడతామని హెచ్చరించారు. శనివారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. "ఈ దేశం ధర్మసత్రం కాదని వారికి స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడ ఉంటారు. ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, దేశం నుంచి తరిమికొడతాం" అని ఆయన పేర్కొన్నారు.

## పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ



ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు pmkisan.gov.in వెబ్‌సైట్‌లోని 'ఫార్మర్స్ కార్నర్'ను సందర్శించవచ్చు.

## ఏపీ, తెలంగాణకు భారీ వర్ష సూచన..
### ఉరుములు, పిడుగులతో ముంచెత్తనున్న వానలు



తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రుతుపవనాలు ఎంట్రీ ఇచ్చినా, అక్కడక్కడ మాత్రమే వర్షాలు కురిశాయి.. అయితే, నేటి నుంచి వాతావరణం పూర్తిగా చల్లబడనుందని, ఇరు రాష్ట్రాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఏపీలోని ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలపై వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండబోతోంది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వానలు కురుస్తాయి. తెలంగాణలో నేడు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా సెంట్రల్, దక్షిణ తెలంగాణ జిల్లాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట్, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణ్ పేట్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, జనగాం, కామారెడ్డి జిల్లాల్లో సాయంత్రం నుండి అర్ధరాత్రి సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో కూడా పగటిపూట ఎండ ఉన్నప్పటికీ.. రాత్రి సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే ముప్పు ఉందని వెదర్ రిపోర్ట్స్ చెబుతున్నాయి.

## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

### : హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చిచెప్పారు.

## విశాఖ పర్యటనకు రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 30వ తేదీన విశాఖపట్నం పర్యటనకు రానున్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ప్రథమ స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రథమ స్నాతకోత్సవంలో 2021 నుండి 2026 విద్యా సంవత్సరాల మధ్య తమ కోర్సులు, ప్రోగ్రామ్‌లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సుమారు 400 మంది విద్యార్థులకు రాష్ట్రపతి స్వయంగా డిగ్రీ పట్టాలను అందజేయనున్నారు. వీరితో పాటు వివిధ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన 15 మంది టాపర్లకు గోల్డ్ మెడల్స్ కూడా ప్రదానం చేయనున్నారు. రాష్ట్రపతితో పాటు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర ఐటీ అండ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దేశ ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతితో పాటు సీఎం, గవర్నర్ ఒకే వేదికపైకి వస్తుండటంతో విశాఖ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ భద్రతా ఏర్పాట్లను చేస్తోంది.

## పోక్సో కేసు.. బండి సంజయ్ కొడుకు భగీరథ్‌కు బెయిల్



తెలంగాణలో గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భగీరథ్‌కు ఎట్టకేలకు మల్కాజ్‌గిరి కోర్టులో ఊరట లభించింది. దాదాపు నెల రోజులుగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అతనికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో భగీరథ్‌పై కఠినమైన పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కొడుకు కావడం, పైగా సున్నితమైన కేసు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిన భగీరథ్.. మే 17న పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యాడు. ఆ తర్వాత మేడ్చల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో నెల రోజులకు పైగా జైల్లోనే గడపాల్సి వచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ పరీక్షల నేపథ్యంలో, భగీరథ్ కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో, భగీరథ్ జైలు నుంచి బయటకు రానున్నారు.

## నిరాహార దీక్ష చేస్తా

### : కాంగ్రెస్ ప్రభుత్వానికి కవిత వార్నింగ్



సింగరేణి 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న దాదాపు 1200 మంది వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఒక నెల రోజులు టైమ్ ఇస్తున్నామని, ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకపోతే జులై 20 నుంచి తాను నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు. సింగరేణిలో ఏ చిన్న పని జరగాలన్నా నేరుగా డిప్యూటీ సీఎం ఆఫీస్ నుంచే లంచాలు అడుగుతున్నారంటూ కవిత సంచలన ఆరోపణ చేశారు. కాంగ్రెస్ పాలనలో లాభాల్లో ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. మొన్న జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడికి తీవ్ర గాయాలవడానికి యాజమాన్యం వాడుతున్న నాసిరకం డిటోనేటర్లే కారణమన్నారు. గనుల లోపల పని చేసే కార్మికులకు కనీసం స్వచ్ఛమైన గాలి, మంచి నీరు కూడా ఇవ్వకుండా అధికారులు కక్కుర్తి పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్ అయిన కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చడం కోసం సింగరేణికి ప్రత్యేకంగా 'హౌసింగ్ బోర్డు' ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం లేదా కార్మిక సంఘం తరఫున రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. అలాగే విజిలెన్స్ ఎంక్వయిరీల పేరుతో కార్మికులను భయభ్రాంతులకు గురిచేయవద్దని అన్నారు. ఉద్యమ కాలం నుంచే తాను సింగరేణి కార్మికులతో కలిసి నడిచానని గుర్తుచేసిన కవిత... తెలంగాణ హక్కుల కోసం తాను స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని భూపాలపల్లి ప్రజలు, బొగ్గుగని కార్మికులు గుండెల్లో పెట్టుకుని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ఎస్ఏఐ హాస్టల్ మూసివేతతో 190 మంది క్రీడాకారుల భవిష్యత్తు ప్రశ్నార్థకం






హైదరాబాద్ ఎస్టేట్, జూన్ 20: అథ్లెటిక్స్, ఆర్చరీ, హాకీ, కబడ్డీ విభాగాలకు చెందిన సుమారు 190 మంది రెసిడెన్షియల్ క్రీడాకారులు గత రెండు నెలలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. క్రీడాకారుల కోసం నిర్వహిస్తున్న హాస్టల్ మూసివేయబడటంతో వారు క్రమబద్ధమైన శిక్షణ, పోటీ అవకాశాలకు దూరమయ్యారని క్రీడా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయర్ పోటీల నిర్వహణ నేపథ్యంలో గచ్చిబౌలి హాకీ కాంప్లెక్స్‌లో పునరుద్ధరణ పనులు చేపట్టాల్సి రావడంతో శిక్షణ కేంద్రాన్ని తాత్కాలికంగా ఇతర ప్రదేశానికి తరలించాలని నిర్ణయించారు. ఈ మార్పు పూర్తిగా తాత్కాలికమని, 2026 మార్చి 15 నాటికి తిరిగి అప్పగిస్తామని సంబంధిత అధికారులు గతంలో పేర్కొన్నారు.అయితే నిర్ణీత గడువు ముగిసినప్పటికీ హాస్టల్‌ను తిరిగి క్రీడాకారుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురాలేదని క్రీడా వర్గాలు ఆరోపిస్తున్నాయి. 2029 వరకు అమలులో ఉన్న అవగాహన ఒప్పందం ప్రకారం క్రీడాకారుల శిక్షణ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల వల్ల క్రీడల అభివృద్ధి దెబ్బతింటోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.క్రీడాకారులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు హాస్టల్‌ను వెంటనే తిరిగి క్రీడా శిక్షణ అవసరాలకు కేటాయించి, రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలను పునఃప్రారంభించాలని ప్రభుత్వాన్ని మరియు సంబంధిత అధికారులను కోరుతున్నారు.దేశవ్యాప్తంగా క్రీడా శిక్షణ కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగుతున్న తరుణంలో తెలంగాణలో ఏర్పడిన ఈ పరిస్థితి పట్ల క్రీడా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారుల భవిష్యత్తు దృష్ట్యా సమస్యను తక్షణమే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నందుపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించిన దేశపాగ నరసింహ





( హైదరాబాద్ ఎస్టేట్రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 20:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలోని నందిపల్లి గ్రామంలో.. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సిడిపిఓ శాంతిశ్రీ చేతుల మీదుగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ షేక్ ఎజాస్ మరియు వార్డు సభ్యులు దేశపాగ లింగి.సంతు , కల్వకోల్ మహేందర్, పంచాయతీ కార్యదర్శి ఎస్ జానయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి నిరంజన్, సూపర్వైజర్ శ్రీదేవి, ఏఎన్ఎంఎం మంజుల, ఆశ వర్కర్ అండాలు, అంగన్వాడీ టీచర్ కే కవిత అంగన్వాడి ఆయా షమీం, గ్రామంలో ఉన్న ప్రజా ప్రతినిధులు మహిళలు గర్భిణీలు స్త్రీలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది అని తెలియజేశారు

# కల్వకోల్ గ్రామంలో పది సంవత్సరాల విద్యుత్ సమస్యను పరిష్కరించిన సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ

## కల్వకోల్ గ్రామంలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 20:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో గత పది సంవత్సరాల నుంచి విద్యుత్ సమస్య వస్తూ పోతూ గ్రామంలోని ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యను సర్పంచ్ ప్రత్యేక దృష్టిని పెట్టి కరెంట్ ఏఈ చక్రపాణి తో మాట్లాడి వెంటపడి 160 వాట్స్ గల ట్రాన్స్ఫారాన్ని మంజూర్ చేయించి ఈరోజు గ్రామంలో కరెంట్ సమస్యను పరిష్కరించడం జరిగింది. దీనికి సహకరించిన మండల్ ఏఈ చక్రపాణి కి గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ తరపున గ్రామపంచాయతీ పాలక వర్గం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఇదేవిధంగా నిరంతరం విద్యుత్ సమస్య లేకుండా ఉండే విధంగా సహకరించాలని కరెంట్ డిపార్ట్మెంట్ ని కోరుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. బక్కని రవి మాదిగ, బొజ్జం శ్రీనివాస్, లైన్మెన్ శ్రీనివాస్, పులిమామిడి రవీందర్, బస్సు చంద్రయ్య, ప్రవీణ్, శ్రీకాంత్, ఎర్ర నవీన్, తిరుమలి నరసింహ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# జూలై 25లోపు ఇంటింటా ఓటర్ల ధృవీకరణ పూర్తి చేయాలి :డీసీ వెంకట్ రామ్




( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 20:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు) కీలక పాత్ర పోషించాలని జల్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మరియు ఏఈఆర్ఓ బి.వెంకట్ రామ్ సూచించారు.ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసి,జూలై 25వ తేదీలోపు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించాలని తెలిపారు.అనర్హులను ఓటరు జాబితాలో కొనసాగించరాదని స్పష్టం చేశారు.ప్రిన్సెస్ ఈఎస్ఐఎన్ గర్ల్స్ హై స్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన,జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ విడుదల చేయనున్నట్లు తెలిపారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజలు ఎలాంటి అపోహలు,అనుమానాలు పెట్టుకోకుండా బిఎల్ఓలకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ట్రైనర్లు ఆనంద్ కుమార్,మహేష్, న్నికల డిప్యూటీ తహసీల్దార్లు శేఖర్,నరేష్,అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వినయ్ కుమార్,సూపర్వైజర్లు,బిఎల్ఓల,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# విశాఖపట్నానికి చెందిన రాధా గాయత్రి మసూరీలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి

## : భర్త ప్రమేయంపై కుటుంబ సభ్యుల తీవ్ర అనుమానాలు

హైదరాబాద్, 20 జూన్, 2026
హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్
మసూరీలో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించిన రాధా గాయత్రి స్నేహితులు మరియు కుటుంబ సభ్యులమైన మేము, ఆమె మరణం పట్ల తీవ్ర విచారం మరియు ఆవేదన వ్యక్తం చేస్తున్నామని చనిపోయిన శ్రీమతి రాధా గాయత్రి స్నేహితులు సుచరిత, వంశీకృష్ణ, రుక్మిణి ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.



న్యాయం కోసం గళ మెత్తడంలో ప్రభుత్వం, పోలీసులు మరియు మీడియా మద్దతును కోరుతున్నామని వారు తెలిపారు. అంతకు ముందు రోజు వరకు ఆరోగ్యంగా ఉన్న ఆమె మరణంలో, ఆమె భర్త శ్రీ సౌమ్య శ్రీ చరణ్ ప్రమేయం ఉన్నట్లు కనిపిస్తోంది. ఆమె భర్త ఆమెకు ఏదో పానీయం ఇవ్వగా, ఆ తర్వాత ఆమె రక్తస్రావంతో మరణించి కనిపించిందని, ఆమె కేవలం ఒక వస్త్రంతో నేలపై పడి ఉందనీ
ఆ సంఘటన గురించి ఉదయం పూట మాత్రమే అతను హోటల్ సిబ్బందికి మరియు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడనీ వారు తెలిపారు. అయితే, తన తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో భాగంగా, అతను అర్ధరాత్రి 1:32 గంటలకు రాధా గాయత్రితో కలిసి ఉన్న ఫోటోను ఆమె తల్లిదండ్రులకు పంపడం ఆశ్చర్యకరంగా ఉందని సౌమ్య శ్రీ చరణ్ ఆమె ఎలా మరణించిందో సరైన వివరణ ఇవ్వలేక పోతున్నాడని దానికి బదులుగా, అతను ఈ వ్యవహారం నుండి క్షేమంగా బయటపడేందుకు తన తల్లిదండ్రులతో కలిసి పరిస్థితులను తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ఆమె మరణానికి సంబంధించిన అన్ని పరిస్థితులపై నిష్పక్షపాతమైన, పారదర్శకమైన మరియు సమగ్రమైన విచారణ జరపాలని మేము కోరుతున్నాము.
రాధా గాయత్రి ఎంతో ఆశయాలు, ప్రతిభ మరియు దయగల స్వభావం కలిగిన యువతి. సైకాలజీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన ఆమె, ఇతరులకు సహాయం చేయడం పట్ల ఎంతో ఆసక్తిని కలిగి ఉండేది మరియు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, విజయాలు సాధించాలని ఆశించేది. తన కుటుంబ ప్రోత్సాహం మరియు మద్దతుతో ఆ లక్ష్యాలను సాధించాలని ఆమె దృఢ సంకల్పంతో ఉండేది. కాలక్రమేణా, గాయత్రి తన వైవాహిక జీవితంలోని సవాళ్ల గురించి సన్నిహిత స్నేహితులు మరియు కుటుంబ సభ్యులతో కొన్ని విషయాలను పంచుకుంది. తన భర్త వివిధ సందర్భాల్లో భిన్నమైన ప్రవర్తనను ప్రదర్శించేవాడని, వారి బంధంలో అతిగా హక్కులు కోరడం అనుమానం మరియు నియంత్రించే ధోరణి వంటి సమస్యలు ఉన్నాయని ఆమె చెప్పినట్లు సమాచారం. వ్యక్తిగత సవాళ్లు ఎదురైనప్పటికీ, ఖూరాజ పరీక్షలకు సన్నద్ధం కావడం వంటి తన ఆశయాలను కొనసాగించాలని ఆమె భావించేది.ఆ స్నేహితులతో జరిపిన చర్చల్లో, గాయత్రి ఎల్లప్పుడూ ఈ సమస్యలను సానుభూతి మరియు అవగాహనతో పరిష్కరించుకోవడానికి ప్రయత్నించేది; ముఖ్యంగా తన భర్త ఎదుర్కొంటున్నట్లుగా ఆమె భావించిన భావోద్వేగ మరియు మానసిక సంఘర్షణలను దృష్టిలో ఉంచుకుని ఆమె అలా వ్యవహరించేది. సైకాలజీ గ్రాడ్యుయేట్‌గా, ఆమె ఆ సంబంధాన్ని మెరుగుపరచడానికి, మద్దతు ఇవ్వడానికి, ప్రోత్సహించడానికి నిరంతరం ప్రయత్నించింది.
అదే సమయంలో, ఈ విషాద సంఘటన తర్వాత ఆమె భర్త శ్రీ చరణ్ ప్రవర్తన, మౌనం, అలాగే గాయత్రి తల్లిదండ్రులు మరియు ఆత్మీయుల పట్ల సంభాషణ, సానుభూతి లోపించాయని కుటుంబ సభ్యులు భావించడం వంటివి ఆమెకు సన్నిహితంగా ఉన్నవారిలో అనేక ప్రశ్నలు, ఆందోళనలను రేకెత్తించాయని వారు తెలిపారు.
ఈ ఆందోళనలు సహజంగానే కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య ఊహాగానాలకు, వేదనకు దారితీస్తున్నాయి.తన గురించి తాను మాట్లాడటానికి ఇప్పుడు మన మధ్య లేని రాధా గాయత్రి గురించి




నిజాన్ని తెలుసుకోవాల్సిన సమయం ఇది. శ్రీ చరణ్ రాధను మానసికంగా వేధించేవాడని వారు తెలిపారు. తన భర్త ప్రవర్తన గురించి నిజ స్వరూపంతో మనసు విప్పి చెప్పడానికి ఆమె తన తల్లిదండ్రులను కలవాలనుకుంది. అతను నిరంతరం ఆమెను వెంబడించేవాడు, వీడియో కాల్స్ చేసేవాడు, ఎక్కడున్నావో చూపించమని అడిగేవాడు. నిరంతర నిఘా కోసం, ఆమెకు తెలియకుండా, ఆమె అనుమతి లేకుండా రాధ ల్యాప్‌టాప్‌లో ట్రాకింగ్ పరికరాన్ని పెట్టడమే అతని అనుమానాస్పద వైఖరికి నిదర్శనమని వారు ఆరోపించారు.
ఈ విషయంపై సంపూర్ణ, నిష్పాక్షిక, సమగ్ర విచారణ జరిపి, అన్ని వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మేము సంబంధిత అధికారులను వినయ పూర్వకంగా కోరుతున్నాము. రాధా గాయత్రికి న్యాయం జరగాలని, దుఃఖంలో ఉన్న ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సమాధానాలు లభించాలని మేము కోరుతున్నాము.
నిందితుడిని శిక్షించేందుకు, శ్రీచరణ్ సోమయాజులను తక్షణమే అరెస్టు చేసేందుకు మాకు మద్దతు ఇవ్వాలని మేము భారత హోం మంత్రిని, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిని, తెలంగాణ ముఖ్యమంత్రిని, పోలీసు శాఖను, పరిపాలనను మరియు మీడియాను కోరుతున్నామని వారు తెలిపారు.

# ఎమ్మెల్యే సొంత నిధులతో బోరు వేయించి మోటార్ బిగించారు.





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతిదీ మునుగోడు
బంగారిగడ్డ గ్రామంలోని 8 ,9, 10. వార్డులోని ప్రజల నీటి కొరతతో ఇబ్బందుల గురి అవుతున్నారు. విషయము తెలుసుకున్న సర్పంచ్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి గారి దృష్టికి తీసుకుపోవడంతో వెంటనే స్పందించి ఎమ్మెల్యే తమ సొంత నిధులతో బోరు వేయించి మోటార్ బిగించిబి నీటి సమస్యను తీర్చడం తో సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల తరపున సర్పంచ్ ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలియజేశారు

## రాష్ట్రవ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

### : లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దశరథ నాయక్.



హైదరాబాద్ ఎస్టేట్, జూన్ 26: రాష్ట్రంలో భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు ప్రతి గ్రామం, ప్రతి పల్లె, ప్రతి పట్టణం, ప్రతి వీధిలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రభుత్వం విస్తృతంగా ప్రోత్సహించాలని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. దశరథ్ నాయక్ కోరారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి ఇంటి వద్ద, అలాగే రైతులు తమ పొలాల్లో కూడా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో నీటి కొరత సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి పంపించే చర్యలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. అలాగే రహదారులు, జాతీయ రహదారులు, కొండ ప్రాంతాల పరిసరాల్లో కూడా పెద్ద ఎత్తున ఇంకుడు గుంతలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టే ప్రజలకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, సోషల్ మీడియా వేదికలను సమర్థవంతంగా వినియోగించాలని ఆయన అన్నారు. నీటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు నీటి వనరులను కాపాడేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఎం. దశరథ్ నాయక్ తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 20:-

ఆమనగల్లు: రాబోయే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆమనగల్లు న్యాయస్థానంలో శనివారం కీలక సమావేశం జరిగింది. న్యాయ విభాగం మరియు పోలీసు శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. మహేశ్వరం ఉప పోలీసు అధికారి జానకిరెడ్డి, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మడ్గుల ప్రాంతాలకు చెందిన పోలీసు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం వివిధ పోలీస్ స్టేషన్లు మరియు న్యాయస్థానాల్లో ఉన్న రాజీ ద్వారా పరిష్కరించదగిన వ్యవహారాలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించేందుకు అవసరమైన చర్యలు, శాఖల మధ్య సమన్వయం, కేసుల గుర్తింపు మరియు పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేసే అంశాలపై మార్గనిర్దేశం చేశారు. ప్రజలకు సులభమైన న్యాయ సేవలు అందించే దిశగా ఎక్కువ సంఖ్యలో వివాదాలు రాజీమార్గంలో ముగిసేలా అన్ని విభాగాలు సమిష్టిగా పనిచేయాలని అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలకు మరింత ఉపయోగకరంగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.

## రైతాంగానికి కాంగ్రెస్ పాలనలో న్యాయం జరగలేదు

### : సబితా ఇంద్రారెడ్డి

### – రైతు సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది

### : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 20:-

రంగారెడ్డి జిల్లా: మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని పీఎస్‌జీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతుల సంక్షేమం కోసం ప్రకటించిన పలు కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదని ఆమె అన్నారు. రంగారెడ్డి జిల్లా సహా మహేశ్వరం ప్రాంత రైతులకు అందాల్సిన ఆర్థిక సహాయ పథకాల విషయంలో ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు రైతులకు అనేక భరోసాలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై స్పష్టత చూపడం లేదని విమర్శించారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు విషయంలో సరైన చర్యలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ కాలంలో అమలైన రైతు అనుకూల కార్యక్రమాలను నిలిపివేయడం వల్ల వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడిందని అన్నారు. రైతులకు అందించాల్సిన రుణ ఉపశమనం, పంట పెట్టుబడి సహాయం, పంటల సాగుకు అవసరమైన సదుపాయాల కల్పనలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆమె ఆరోపించారు. అలాగే రైతు కుటుంబాలకు భరోసా కల్పించే బీమా పథకం అమలులోనూ అనేక లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయదారుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన సబితా ఇంద్రారెడ్డి, రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ సిబ్బందిపై దాడి దురదృష్టకరం

### – బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి కి వినతి

### – ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు ముప్పుగా మారుతున్న దాడులు

### – రెవెన్యూ సిబ్బందికి రక్షణ కల్పించాలని ట్రెసా డిమాండ్



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 20:-

రంగారెడ్డి జిల్లా: అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న రెవెన్యూ శాఖ సిబ్బందిపై ఇటీవల చోటుచేసుకున్న దాడి ఘటనను తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రంగారెడ్డి జిల్లా కమిటీ తీవ్ర ఆవేదనతో ఖండించింది. ప్రజా సేవలో భాగంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ సిబ్బందిపై భౌతిక దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగించే చర్యగా సంఘం పేర్కొంది. ఇటువంటి సంఘటనలు ఉద్యోగుల్లో భయాందోళనలు సృష్టించడంతో పాటు పరిపాలనా వ్యవస్థ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ట్రెసా అభిప్రాయపడింది. ఈ ఘటన నేపథ్యంలో జిల్లా పరిపాలన తక్షణమే స్పందించి సంబంధిత అంశాలపై చర్యలు చేపట్టాలని సంఘం ప్రతినిధులు కోరారు. సంఘటనకు కారణమైన వారిని గుర్తించి చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించడంతో పాటు, ఫీల్డ్ స్థాయిలో పనిచేసే రెవెన్యూ సిబ్బందికి తగిన రక్షణ చర్యలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సమగ్ర భద్రతా వ్యవస్థను అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి భయాందోళనలు లేకుండా తమ బాధ్యతలను నిర్వర్తించేలా అనుకూల వాతావరణాన్ని సృష్టించాలని కోరారు. ఉద్యోగుల గౌరవం, భద్రత మరియు విధి నిర్వహణకు అవసరమైన రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ట్రెసా జిల్లా శాఖ పేర్కొంది. దాడి ఘటనల పట్ల రాజీ లేకుండా వ్యవహరించడం ద్వారా ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పెంపొందించవచ్చని సంఘం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు బాధ్యులపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బంది భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గౌతమ్ కుమార్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ, ట్రెసా ఎస్. జనార్ధన్ రావు జిల్లా అధ్యక్షుడు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం మాటల్లోనే.. భూమిపై కనిపించడం లేదన్న బీఆర్ఎస్ విమర్శ

## వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేసిన కాంగ్రెస్ పాలన

## కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు







హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 20:-

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యం లభించడం లేదని, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపట్టడం లేదని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల అభివృద్ధి కోసం భారీ స్థాయిలో ఆర్థిక సహాయం, పంట పెట్టుబడి మద్దతు, రుణ ఉపశమనం వంటి కార్యక్రమాలు అమలు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతులకు అందాల్సిన ప్రయోజనాలు పూర్తి స్థాయిలో చేరడం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పండించిన ధాన్యానికి తగిన స్థాయిలో కొనుగోళ్లు జరగకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. రైతుల సంక్షేమంపై ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎరువుల సరఫరాలో కూడా సమస్యలు నెలకొన్నాయని, రైతులు అవసరమైన సమయంలో వాటిని పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇప్పటికే ఆందోళనలో ఉన్నారని, ఏ పంట సాగు చేయాలన్న దానిపై సందిగ్ధంలో ఉన్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రజాప్రతినిధులు రైతులకు భరోసా కల్పించే చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ఆ దిశగా చొరవ కనిపించడం లేదని విమర్శించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కూరగాయల సాగు చేసే రైతులు సరైన ధరలు లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మధ్యవర్తులే ఎక్కువగా లాభపడుతున్నారని అన్నారు. రైతులకు అందాల్సిన పెట్టుబడి సహాయం కూడా నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం అందడం లేదని ఆరోపించారు. రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, వెంటనే వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోరారు.

## మందమరి ఏరియా సింగరేణి జీఎం కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం .

### ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగ





హైదరాబాద్ ఎస్టేట్ 20 జూన్

మంచిర్యాల జిల్లా మందమరి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ (ఇంటర్నేషనల్ యోగా డే) కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మందమరి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి, కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ రోజు మందమర్రి ఏరియాలోని అన్ని గనులు, అన్ని విభాగాలు (డిపార్ట్మెంట్లు) మరియు జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఈ విధంగా యోగా కార్యక్రమాన్ని విస్తృతంగా జరిపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని, దీని ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం సిద్ధిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులందరూ ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ మరింత ప్రగతి సాధిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏరియాలోని వివిధ విభాగాల అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు మరియు జీఎం ఆఫీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం యోగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం జి .ఎల్. ప్రసాద్, ఏ ఐ టి యు సి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సి ఎం ఓ ఏ ఐ జాయింట్ సెక్రటరీ రవి, డీజీఎం పర్సనల్ సిహెచ్. అశోక్, సీనియర్ పిఓ సత్యనారాయణ, ఏ ఐ టి యు సి ఫిట్ సెక్రటరీ గీతిక, యోగా మాస్టర్ శంకర్, జిఎం కార్యాలయం ఉన్నత అధికారులు మరియు జిఎం కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై దాడి: ఐదుగురు అరెస్ట్



జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల అణచివేతలో భాగంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా కె.కోటపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో, చీడికాడ ఎస్సై నారాయణరావు మరియు వారి పోలీస్ సిబ్బంది ఈరోజు ప్రత్యేక నిఘా నిర్వహించారు. చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోనం శివారు ప్రాంతంలో కొందరు వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు అందిన నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు మెరుపు దాడి చేశారు. పేకాట ఆడుతూ దొరికిన ఐదుగురు (5) నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి ₹3,000/- నగదును, పేకాట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీస్ అధికారులు హెచ్చరించారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

21 ఆదివారం జూన్ 2026

# ఇది నా విజయం కాదు.. దేశభక్తుల విజయం!

## తిరంగా యాత్ర కేసు కొట్టేయడంతో బేగంబజార్‌లో లడ్డు యాదవ్ సంబరాలు





హైదరాబాద్, జూన్ 20: తిరంగా యాత్ర చేసినందుకు పోలీసులు తనపై పెట్టిన కేసులను న్యాయస్థానం కొట్టివేయడంతో భగత్ సింగ్ యువసేన నాయకులు పెద్ద ఎత్తున్న సంబరాలు జరుపుకున్నారు.. బేగంబజార్ ఛత్రి వద్ద భగత్ సింగ్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు లడ్డు యాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి చౌరస్తా వద్ద బాణాసంచా పేల్చి మిఠాయులు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.. ఈ సందర్భంగా లడ్డు యాదవ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా 2024 ఆగష్టు 15వ తేదీన బేగంబజార్ ఛత్రి వద్ద నుండి భగత్ సింగ్ యువసేన ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు.. ఈ సందర్భంగా షాహినాయత్ గంజ్ పోలీసులు తనపై సుమోటోగా ఎలాంటి ఆధారాలు లేకుండా కేసును నమోదు చేసారని అయన తెలిపారు.. ఈ కేసును నాంపల్లి న్యాయస్థానం విచారణ చేపట్టి కొట్టివేసిందని అయన వెల్లడించారు.. ఈ కేసులో పోలీసులు న్యాయస్థానానికి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో తన వైపు న్యాయం గెలిచిందని ఆనందం వ్యక్తం చేశాడు.. ఇది నా సొంత విజయం కాదని దేశ భక్తుల విజయం, ఇదే స్ఫూర్తితో ఆగష్టు 15న భారీ తిరంగా యాత్రను నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ యువసేన నాయకులు గోరక్షక్ దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ యాదవ్, సూర్య శుక్ల, సుమిత్ యాదవ్, రాహుల్ ఓజా, విక్కీ సింగ్, కన్నయ్యలాల్, తదితరులు పాల్గొన్నారు.

# 83వ వార్డులో ఇంటింటి ఓటర్ల జాబితా



పట్టణంలోని 83వ డివిజన్ 171 బూత్ పరిధిలో నాయాల వీధి, A ఏఎంసికాలనీ, మిర్యాల కాలనీలో చురుగ్గా ఇంటింట ఓటర్ల సర్వే వివరాలు తెలుసుకుంటున్న బి.ఎల్.ఓ రాధ, టిడిపి పార్టీ శ్రేణులు పిట్ల రాజు, ఎస్. భానుచందర్ (అఖి), బొమ్మల దేవి, గణేష్ కలిసి హాజరయ్యారు. ఇంటింటా ఓటరు పరిశీలన చేపట్టారు తదుపరి 18 సంవత్సరాలు నిండినవారు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు బయట ప్రాంతాలకు వలస వెళ్లిన వారి కూడా వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది.

# వ్యవసాయ అధికారులతో.... కొణతాల సమీక్ష



స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన వరి విత్తనాలు, యూరియా ఎరువులు మరియు వ్యవసాయ ఇన్‌పుట్లు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని, నియోజకవర్గంలోని ప్రతి రైతుకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాల ద్వారా రైతుల ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.5,000, ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద రూ.2,000, మొత్తంగా రూ.7,000 చొప్పున రైతుల ఖాతాల్లో రేపు జమ కానున్నాయని పేర్కొన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో సుమారు 22,202 మంది రైతు సోదరులకు రూ.14.47 కోట్ల ఆర్థిక సహాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అనకాపల్లి సబ్ డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు కొమ్మూరు ధనలక్ష్, కశింకోట మండల వ్యవసాయ అధికారులు స్వప్న, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాల సవాళ్లపై అధికార యంత్రాంగానికి ఎమ్మెల్యే అలర్ట్

## ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు.. సేవల్లో నాణ్యత పెంచాలి

## కాలనీల అభివృద్ధి, ఆరోగ్య భద్రతపై ప్రత్యేక కార్యాచరణకు పిలుపు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 20:-

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ: తొర్రూర్: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం తొర్రూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆదిబట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్, ఆదిబట్ల పట్టణాల అభివృద్ధి పనులపై సమగ్రంగా సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా సేవలను అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు.




వర్షాల కారణంగా తలెత్తే ఆరోగ్య సమస్యలను నివారించేందుకు నివారణ చర్యలను మరింత విస్తరించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నియంత్రణ, కాలువల శుభ్రపరిచే కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ విషయంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనుల అమలుపై కూడా ఎమ్మెల్యే ప్రత్యేకంగా చర్చించారు. అంతర్గత రహదారుల అభివృద్ధి, దెబ్బతిన్న మార్గాల పునరుద్ధరణ, తాగునీటి పంపిణీ వ్యవస్థలో లోపాల సవరణ, విద్యుత్ వెలుగుల నిర్వహణ వంటి అంశాల్లో వేగం పెంచాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ, పచ్చదనం పెంపు, ప్రజా వినియోగ స్థలాల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత విభాగాల అధికారులు పాల్గొని తమ శాఖల పనితీరుపై వివరాలు అందించారు.

# ఘనంగా శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉంజల సేవ





శ్రీ గౌరీ పంచాయతన దేవస్థానం నందు శ్రీ గౌరీ పరమేశ్వరుల శుక్రవారం217వ ఉంజల్ సేవ కార్యక్రమం ఘనంగా జరిగినది,ఈ కార్యక్రమమునకు దేవాలయ అర్చకులు.అంపోలు గోపాల కృష్ణ శర్మ , పొందూరు సూర్యనారాయణ శాస్త్రి , వేదవిదులైన పండితులచే నిర్వహించబడినది. ఈ ఉంజల్ సేవలో దొడ్డి లోక అప్పారావు లక్ష్మి, దొడ్డి గణేష్ అప్పలనాయుడు నందిని దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా

సాయి రమ్య వాగ్దాయ మ్యూజిక్ ఇన్స్టిట్యూట్ డి రంజిని బృంద సభ్యులచే భక్తి గీతాలాపన భక్తులు నాకట్టుకున్నాయి.శ్రీ గౌరీ గీత మహిళా మండలి శ్రీ సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, శ్రీ గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని పెంతకం శెట్టి సుజాత పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్,, ఆళ్ల ప్రసాద్ మరియు పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం జరిగింది.

# ఇతరులపై విమర్శలతో కాదు.. ప్రజల మద్దతుతోనే గుర్తింపు వస్తుంది

## : ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి బీఆర్ఎస్ హెచ్చరిక


## మంత్రి పదవి కోసం రాజకీయ డ్రామాలు మానండి.. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి: బీఆర్ఎస్ నేతల కౌంటర్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 20:-

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధి అంశాలను పక్కనబెట్టి ఇతర ప్రాంతాల రాజకీయాలపై వ్యాఖ్యలు చేయడం సరైన విధానం కాదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, వాటిని విస్మరించి రాజకీయ ఆరోపణలతో కాలక్షేపం చేయడం వల్ల ప్రజల్లో విశ్వసనీయత తగ్గుతుందని పేర్కొన్నారు.

ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో స్పందించిన మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, రాజకీయ ప్రయోజనాల కోసం అనవసర వివాదాలను సృష్టించడం మానుకోవాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేసి గుర్తింపు పొందాల్సిందే కానీ, వ్యక్తిగత విమర్శలు లేదా ఆరోపణల ద్వారా రాజకీయంగా ఎదగాలనే ఆలోచన ఫలించదన్నారు.

మహేశ్వరం ప్రాంత ప్రజలు అన్ని పరిణామాలను గమనిస్తున్నారని, వాస్తవాలు లేకుండా చేసే విమర్శలను వారు నమ్మరని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారంపైనే ప్రజలు తీర్పు ఇస్తారని స్పష్టం చేశారు.



ప్రజలతో నిరంతరం అనుబంధం కొనసాగిస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు కట్టుబడి పనిచేసిన నాయకత్వంపై నిరాధార వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకు కూడా హద్దులు ఉండాలని, ఆధారరహిత ఆరోపణలు కొనసాగితే తగిన విధంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# కొణతాల ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎంఈఓ కాశీ







స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ ను శుక్రవారం అనకాపల్లి మండల రెండో విద్యాశాఖాధికారి గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బీ కే వీ విశ్వేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలం, పట్టణ పరిధి లోని పాఠశాలలు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని శాసనసభ్యులు కొణతాల ఎంఈఓ కాశీ నీ కోరారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం అర్హులందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులు ఎవరూ పథకం వర్తించలేదని కార్యాలయాలు చుట్టూ తిరిగే పరిస్థితులు తీసుకురావద్దన్నారు. అందుకు అవసరమైతే అధికారులతో కూడా తాను మాట్లాడతానన్నారు. సీఆర్పీలు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులు పర్యవేక్షిస్తున్న చేబోలు



ప్రజలకు ఎన్నికలలో హామీలు ఇచ్చిన శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ నియోజకవర్గం అభివృద్ధి పదంలో నడిపించడమే ధ్యేయంగా ఉన్నారని 84వ వార్డు జనసేన పార్టీ ఇంచార్జ్ చేబోలు దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 84 వ వార్డు లో కోప్పక నుండి సిరసపల్లి వరకు డ్రైనేజీ వ్యవస్థ పనులు మూడు భాగాలుగా అధికారులు విభజించారు. అందులో రెండు భాగాలు పూర్తిస్థాయిలో పనులు పూర్తయి. మిగతా ఒక భాగం పనులును శనివారం దుర్గాప్రసాద్ పైవేక్షించారు. ఈ పనులలో ఎటువంటి నాణ్యత లేకపోయినా వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్ వెంటనే అందించాలి

### – ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గుండ్ల సింగారంలో ని ప్రభుత్వ పాఠశాల సందర్శన,



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలు యూనిఫార్మ్స్,స్కూల్ బ్యాగ్స్ అందించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ లోని గుండ్ల సింగారం లో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలను ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా వ్యాప్తంగా, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఇప్పటివరకు చాలా చోట్ల స్కూలు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్ రాలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై 5 రోజులు గడుస్తున్న ఇప్పటివరకు వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు అందించలేదన్నారు. ప్రభుత్వ విద్య రంగ సమస్యలను పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్య సంస్థలు ప్రారంభం కాక ముందే తెలంగాణ రాష్ట్రంలో, హనుమకొండ జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు యూనిఫార్మ్స్ అమ్ముతున్న కూడా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్, యూనిఫార్మ్స్ అందించలేని ప్రభుత్వం, పేద విద్యార్థుల పక్షాన ఉందా.. లేదా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల పక్షాన ఉందా అని ఒక్కసారి ఆలోచించుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు అయిన త్రాగునీరు వసతి, మరుగుదొడ్లు, స్పోర్ట్స్ కిట్స్, కంప్యూటర్స్ ల్యాబ్స్, గ్రౌండ్స్, తరగతుల గదులలో ఫ్యాన్స్, లైట్స్, సరైన టీచర్స్ లేకపోవడం వంటి చాలా సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని, అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ముట్టడిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయి కుమార్,అనుఫ్, అభిషేక్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ సంబంధించిన రోగులను తప్పనిసరిగా గుర్తించాలి...

### – ఆస్పత్రులను, డయాగ్నస్టిక్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్వో,

ప్రభుత్వం క్యాన్సర్ ను నోటిఫైయబుల్ వ్యాధుల జాబితాలో చేర్చినందున జిల్లాలోని క్లినిక్ లు, డయాగ్నొస్టిక్ సెంటర్ లు,హాస్పిటల్ లు తప్పనిసరిగా తెలంగాణ క్యాన్సర్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని , గుర్తించిన ,చికిత్స అందించిన లేదా తమ వద్దకు వచ్చిన క్యాన్సర్ కేసులను పోర్టల్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ ఎస్ .డి .రాంకుమార్ ఆదేశించారు. అందులో భాగంగా ఆయన శుక్రవారం హనుమకొండ లోని రెనోవా బన్ను క్యాన్సర్ హాస్పిటల్, అజర హాస్పిటల్ ,విజయ డయాగ్నొస్టిక్ సెంటర్, రాడార్ డయాగ్నొస్టిక్ సెంటర్ లను ఆకస్మికంగా సందర్శించారు .ఈ సందర్భంగా పోర్టల్ లో వారు నమోదు చేస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు.ప్రస్తుతం నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతుండడం అలాగే మరణాలు ఎక్కువగా నమోదవుతున్నందున వ్యాధి తీవ్రతను ,అలాగే రిస్క్ ఫ్యాక్టర్లను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఒక సమగ్రమైన ప్రణాళిక రూపొందించడంలో భాగంగా ప్రత్యేకించినఈ పోర్టల్ లో ప్రతి క్లినిక్ ,ఆసుపత్రి నమోదు చేసుకొని తమవద్ద నిర్ధారించబడిన , చికిత్స అందిస్తున్న, తమ ఓపి కి వచ్చిన అన్ని రకముల క్యాన్సర్ కేసుల పూర్తి వివరాలు పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. లేబరేటరీలు , డయాగ్నొస్టిక్ సెంటర్లు నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, వ్యాధి నిర్ధారణలో , రిపోర్టింగ్ లో ఏమాత్రం నిర్లక్ష్యం చూపకూడదన్నారు. రాబోయే వర్షాకాలంలో రాపిడ్ డయాగ్నొస్టిక్ టెస్టింగ్ ద్వారా పాజిటివ్ లను అన్నింటిని డెంగ్యూ గా నిర్ధారించి ప్రజలను ఆందోళనకు గురి చేయవద్దని , డెంగ్యూ ఎలిసా పాజిటివ్ నిర్ధారణ అయిన వారికి డెంగ్యూ ప్రోటోకాల్ ప్రకారం చికిత్స అందించాలన్నారు. ప్లేట్లెట్ కౌంట్ తగ్గిన ప్రతి కేసు డెంగ్యూ గా పరిగణించకూడదన్నారు.తప్పుడు రిపోర్టులు అందించే సెంటర్లను సీజ్ చేయడం జరుగుతుందన్నారు.ఈ తనిఖీలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.మదన్మోహన్ రావు, ఎన్సీడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్ రెడ్డి, డిపిఓ రుక్కుద్దీన్, సంబంధిత ఆసుపత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.

## జూన్ 23 న "రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్" కు ఏబీవీపీ పిలుపు

### – ప్రైవేట్,కార్పొరేట్ విద్యా మాఫియాకు బ్రాండ్ అంబాసిడర్ లా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి
### – రేషనలైజేషన్ పేరుతో 23000 ప్రభుత్వ స్కూళ్ల మూసివేతకు కుట్ర
### – ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల విచ్చలవిడి ఫీజుల దోపిడీకి ప్రభుత్వం రెడ్ కార్పెట్
### – అటకెక్కిన విద్యాహక్కు చట్టం
### – ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు
### – ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు ఇంకా అందని స్కూల్ యూనిఫామ్స్



తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అవుతుందని,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నాడని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ, ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఏబివిపి ఆధ్వర్యంలో జూన్ 23న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ కు పిలుపునిస్తున్నట్లుగా ప్రకటించారు. వరంగల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాచర్ల రాంబాబు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కుట్ర చేస్తున్నాడని, అందుకే రేషనలైజేషన్ పేరుతో 23000 ల పాఠశాలలను మూసేందుకు కంకణం కట్టుకున్నాడని,ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఏజెంట్ లా వ్యవహరిస్తున్నాడని, విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచిందని ఎద్దేవా చేశారు.వెంటనే ప్రభుత్వం ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు,కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లను అందించే విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు పర్యవేక్షణ లేకుండా నడుస్తున్నాయని కావున ఖాళీగా ఉన్న ఎంఈఓ,డిఈఓ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఒక పర్మిషన్ పేరు మీద పలు బ్రాంచు లు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి ఆర్థిక దోపిడీకి పాల్పడుతు సరస్వతి నిలయాలు లాంటి పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీగా ఉన్న టీచింగ్,నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,అదేవిధంగా గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని, ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, జాతీయ విద్యా విధానం 2020ని,విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పాఠశాలలు రీ ఓపెన్ అయిన ఇంతవరకు కొంతమంది విద్యార్థులకు స్కూలు యూనిఫామ్స్ ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థ పై చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో "బ్రేక్ ఫాస్ట్ స్కీమ్" ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థను గాడిన పెట్టాలని,ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడిని నియంత్రించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.విద్యార్థి వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 23న ఏబీవీపీ పాఠశాలల బందుకు పిలుపునిచ్చిందని తెలిపారు.

కావునా విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఈ బంద్ కు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూపల్లి దీపిక, రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్ కుమార్, విభాగ్ కన్వీనర్ ఆరేపెల్లి సుజిత్, గుంటి అభిలాష్,గుగులోత్ నవీన్, రేక అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

### – వరంగల్ పోలీస్ కమిషనర్,




ఆదివారం జరిగే నీట్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషన్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో ఈ నెల 21వ తారీకు ఆదివారం జరిగే నీట్ పరీక్ష సంబంధించి పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేయబడతాయని,ఈ ఉత్తర్వుల ప్రకారం పరీక్ష జరిగే 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులుగా గుమి కూడటం, సభలు సమావేశాలు ర్యాలీలు ధర్నాలు నిషేధించబడ్డాయని, అలాగే పరీక్షా జరిగే పరిసరాలలో పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని తెలిపారు.ఈ ఉత్తర్వులు ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతాయని, ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

## భవిష్యత్ తరాలకు దిక్సూచి రాహుల్ గాంధీ

### – కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి,
### – మండల కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు,



భవిష్యత్ తరాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిక్సూచి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేసుకున్నారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ దాక జోడో యాత్ర చేసి దేశాన్ని సంఘటితం చేశారని , యూపీఏ హయాంలో రెండుసార్లు ప్రధాని పీఠాన్ని అధిరోహించే అవకాశం వచ్చినప్పటికీ తృణప్రయంగా పదవిని వదులుకున్న త్యాగశీలి అని కొనియాడారు. దేశంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో కులగణన అనే అంశాన్ని తీసుకువచ్చిన గొప్ప నాయకుడని అన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమని, రాబోవు రోజుల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైనాల కుమారస్వామి, నిమ్మల రమేష్, దుబాస్ కృష్ణమూర్తి వైద్యుల వెంకటరాజిరెడ్డి, సర్పంచ్ గజ్జి ఐలయ్య, మామిడిపల్లి సాంబయ్య నాయకులు బాసని రవి,జగన్, లాడే రాజ్ కుమార్, మారపెల్లి రాజేందర్, మసికే కుమార్, వడ్డేపల్లి శ్రీను, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాధికారతకు శిక్షణలే బలమైన పునాది

### – హసన్‌పర్తిలో ఎస్‌బిఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను సందర్శించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి




ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మహిళలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (సీఆర్పీలు) తమతో పాటు సమాజ ఆర్థికాభివృద్ధికి దోహద పడాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలోని సంస్కృతి విహార్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ ఆర్‌సెటీ)లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 64 మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని (ఫైనాన్షియల్ లిటరసీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్) జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమం నిర్వహణ, లక్ష్యాలు, అందిస్తున్న అంశాలపై వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యుల్లో డిజిటల్ లావాదేవీలు, నగదు రహిత చెల్లింపులు, సైబర్ నేరాల నివారణ, బ్యాంకింగ్ సేవల వినియోగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బీమా పథకాల పై సీఆర్పీలకు సమగ్ర అవగాహన కల్పిస్తున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, ఎస్‌బీఐ ఆర్‌సెటీ ఇన్‌చార్జి డైరెక్టర్ మహేందర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ స్థాయిలో మహిళా సంఘాల సభ్యులకు సమర్థవంతంగా చేరవేసి ఆర్థిక అక్షరాస్యతను మరింత విస్తరించాల్సిన బాధ్యత సీఆర్పీలపై ఉందన్నారు. ఆర్థిక వ్యవహారాలపై అవగాహన పెరగడం ద్వారా కుటుంబాలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. అనంతరం సంస్థలో కుట్టు, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న 40 మంది మహిళలతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. శిక్షణ ద్వారా పొందుతున్న నైపుణ్యాలను స్వయం ఉపాధి అవకాశాలుగా మలుచుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. మహిళలు ఉపాధి అవకాశాలను సృష్టించుకునే దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అనంతరం సంస్కృతి విహార్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన్ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, తహసీల్దార్ కిరణ్ కుమార్, డీఈ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in

21 ఆదివారం జూన్ 2026

# బాలుడి ప్రాణం కాపాడేందుకు బండ్ల గణేశ్ 5 లక్షల సాయం.. పవన్ కల్యాణ్ స్ఫూర్తితోనేనంటూ భావోద్వేగం!

సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ తనలోని ఉదారత్వాన్ని చాటుకుంటూ ఒక గొప్ప నిర్ణయంతో వార్తల్లో నిలిచారు. ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న హనుమకొండకు చెందిన చిన్నారి నిరంజన్ కుటుంబానికి తాను ప్రకటించిన రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని ఈరోజు తన చేతుల మీదుగా అందజేశారు. హనుమకొండలోని హనుమాన్ నగర్‌లో ఉన్న చిన్నారి నిరంజన్ నివాసానికి బండ్ల గణేశ్ స్వయంగా వెళ్లారు. నిరంజన్‌తో కాసేపు ముచ్చటించి, ధైర్యం చెప్పారు. అతని ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు రాంగోపాల్ చారి, మానసలతో మాట్లాడి... తమ పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్ బ్యానర్ తరపున రూ. 5 లక్షల చెక్‌ను వారికి అందజేశారు. ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా



బండ్ల గణేశ్ మీడియాతో మాట్లాడుతూ... "నేను పవన్ కల్యాణ్ గారి భక్తుడిని. దైవసమానులైన పవన్ కల్యాణ్ గారు ఈ బాబును పరామర్శించినప్పుడే నిరంజన్ విషయం నా దృష్టికి వచ్చింది. ఆయన స్ఫూర్తితోనే నేను ఈ రోజు ఇక్కడికి వచ్చి ఆర్థిక సాయం చేశాను. నిజానికి మేమంతా ఈ స్థాయిలో ఉన్నామంటే దానికి పవన్ కల్యాణ్ గారి దయే కారణం" అంటూ తన 'బాస్'పై ఉన్న భక్తిని చాటుకున్నారు.

ప్రస్తుతం తన కూతురి వివాహ పనులతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, ఈ రోజే వచ్చి సాయం చేయాలని ఫిక్స్ అయినట్లు బండ్ల గణేశ్ చెప్పారు. "నారా భువనేశ్వరి గారి పుట్టినరోజు సందర్భంగా ఈ రోజు ఈ రూ. 5 లక్షల సాయాన్ని నిరంజన్ కుటుంబానికి అందించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. బాబు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ పవిత్రమైన సందర్భంగా నేను ఎలాంటి రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదు" అని స్పష్టం చేశారు.

# గతాన్ని పూర్తిగా మర్చిపోవాలి: శోభిత ధూళిపాళ

అక్కినేని నాగచైతన్యతో వివాహం జరిగిన తర్వాత సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన శోభిత ధూళిపాళ.. రీసెంట్‌గా 'చీకటిలో' వెబ్‌సిరీస్‌తో డిజిటల్ స్క్రీన్‌పై మంచి థ్రిల్ ఇచ్చారు. ప్రస్తుతం కోలీవుడ్ క్రేజీ డైరెక్టర్ పా రంజిత్ తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ డ్రామా 'వెట్టువం' షూటింగ్‌తో బిజీగా ఉన్న ఈ బ్యూటీ... తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చేసిన కొన్ని పర్సనల్ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతమైన చర్చకు దారితీశాయి.

ఇంటర్వ్యూలో భాగంగా యాంకర్ శోభితను ఒక పర్సనల్ క్వశ్చన్ అడిగారు. "మీ లైఫ్‌లో ఏ విషయాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నారు?" అని ప్రశ్నించగా... దానికి శోభిత ఏమాత్రం తడబడకుండా..

"నిన్నటి వరకు నా జీవితంలో జరిగిన ప్రతి సంఘటనను, జ్ఞాపకాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నాను" అని ఆన్సర్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. తన సమాధానానికి గల కారణాన్ని వివరిస్తూ.. "సాధారణంగా లోకం మతిమరుపును ఒక జబ్బుగా చూస్తుంది. కానీ నా దృష్టిలో కొన్నిసార్లు



మతిమరుపు అనేది మనిషికి దొరికే ఒక గొప్ప వరం. ఎందుకంటే లైఫ్‌లో వేరే వాళ్లు మన పట్ల చేసిన బాధాకరమైన పనులు, మన మనసును గాయపరిచిన చేదు జ్ఞాపకాలను మనం మర్చిపోయినప్పుడే జీవితంలో ఫ్రీగా ముందుకు సాగడం సాధ్యమవుతుంది" అని చెప్పుకొచ్చారు. పాత జ్ఞాపకాలలోనే ఎప్పుడూ కూరుకుపోకుండా, వాటన్నింటినీ డిలీట్ చేసేసి రేపటి భవిష్యత్తు గురించి పాజిటివ్‌గా ఆలోచించడమే నేటి అవసరమని శోభిత క్లారిటీ ఇచ్చారు.

# మనసుకూ విశ్రాంతి అవసరం.. సోషల్ మీడియాకు బ్రేక్ ప్రకటించిన హీరోయిన్

ప్రముఖ నటి కయాదు లోహర్ సోషల్ మీడియాకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. శరీరానికి విశ్రాంతి ఇచ్చినట్లే మనసుకు కూడా విశ్రాంతి అవసరమని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులకు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా కొంతకాలం విశ్రాంతి తీసుకుని, స్క్రీన్‌కు అవతల ఉన్న నిజ జీవితంతో మమేకం కావాలనుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఒక సుదీర్ఘ సందేశాన్ని పంచుకున్నారు. "సోషల్ మీడియా నుంచి చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు మనం శరీరానికి ఇచ్చే విశ్రాంతి మనసుకు కూడా అవసరం. నేను కాస్త నెమ్మదించి, డిస్‌కనెక్ట్ అవ్వాలని, స్క్రీన్‌కు అవతల ఉన్న జీవితంతో, నాతో నేను ఎక్కువ సమయం గడపాలని భావిస్తున్నాను" అని ఆమె తన పోస్ట్‌లో రాశారు. "నాకు మద్దతుగా నిలిచిన, ప్రోత్సహించిన, దయ చూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రేమ, సందేశాలు నాకు ఎంతో విలువైనవి. నేను కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉంటాను, కానీ ఏవైనా ముఖ్యమైన అప్‌డేట్స్ ఉంటే నా టీమ్ ఈ ఖాతా ద్వారా పంచుకుంటుంది. అందరూ శాంతి, సంతోషం, దయతో ఉండాలని కోరుకుంటున్నాను. త్వరలో కలుద్దాం" అని ఆమె వివరించారు. కేవలం గత నెలలోనే కయాదు తన తమ్ముడు ఉదయ్ పుట్టినరోజు



సందర్భంగా ఒక అందమైన పోస్ట్ చేశారు. "నువ్వు ఎంత పెరిగినా, నా దృష్టిలో ఎప్పటికీ చిన్నపిల్లవాడివే. జీవితంలో ఏదైనా కాకముందు, నేను మొదట అక్కనయ్యాను" అని ఆమె పేర్కొన్నారు. "నిన్ను తప్ప నా తమ్ముడిని ఎవరూ ఇబ్బంది పెట్టడానికి వీల్లేదు" అని సరదాగా రాసుకొచ్చారు. ఇక, ఆమె సినీ కెరీర్ విషయానికొస్తే.. కయాదు లోహర్ ప్రస్తుతం దర్శకుడు మరియప్పన్ చిన్న రూపొందిస్తున్న హారర్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్'లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమెకు జోడీగా ప్రముఖ నటుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ నటిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ చిత్రంలో జీవీ ప్రకాశ్, కయాదు లోహర్‌లతో పాటు టీఎం కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు.

# ఇదిగో మా క్లీంకార.. తొలిసారి కుమార్తెను చూపించిన రామ్ చరణ్, ఉపాసన... ఫొటో వైరల్



మెగా అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న క్షణం ఎట్టకేలకు వచ్చింది. రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ కుమార్తె క్లీంకార ముఖాన్ని తొలిసారి ప్రపంచానికి చూపించారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఉపాసన తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇప్పటివరకు కూతురు ముఖం కనిపించకుండా జాగ్రత్తపడిన ఈ జంట మూడో బర్త్‌డే రోజున అభిమానులకు ప్రత్యేక కానుక ఇచ్చింది. "మా అమూల్యమైన చిన్నారి క్లీంకారకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ ఉపాసన తన ఫేస్‌బుక్ ఖాతాలో అందమైన తమ ఫ్యామిలీ ఫొటోను పంచుకున్నారు. పచ్చని ప్రకృతి మధ్యలో రామ్ చరణ్, ఉపాసన తమ గారాల పట్టిని ప్రేమగా ఎత్తుకుని ఉన్న ఈ చిత్రం అభిమానులను ఆకట్టుకుంటోంది. నీలి రంగు దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తున్న చిన్నారి అందరి చూపును కట్టిపడేస్తోంది. బుగ్గల నిండా నవ్వు, కళ్లలో అమాయకత్వం, ముఖంలో మెరిసే ఆనందం ఫొటోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రుల ఒడిలో హాయిగా కూర్చుని నవ్వుతున్న మెగా వారసురాలు ఆ కుటుంబ చిత్రానికి మరింత అందాన్ని తీసుకొచ్చింది. కొందరు ఆమె కళ్లు తాత మెగాస్టార్ చిరంజీవి కళ్లలా ఉన్నాయని కామెంట్ చేస్తున్నారు. ఈ పోస్ట్ బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో శుభాకాంక్షల వెల్లువ మొదలైంది. మెగా అభిమానులతో పాటు సినీ ప్రముఖులు క్లీంకారకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మూడేళ్లుగా అభిమానులు ఎదురుచూస్తున్న ఆమె ఫేస్ రివీల్ కావడంతో ఈ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.


# మా సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో అర్థం కావడం లేదు: షాహిద్ కపూర్ ఆవేదన



బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్ హీరోగా, రష్మిక మందన్న, కృతి సనన్ మెయిన్ లీడ్స్‌లో నటించిన లేటెస్ట్ క్రేజీ మూవీ 'కాక్‌టెయిల్ 2'. భారీ అంచనాల మధ్య రీసెంట్‌గా థియేటర్లలోకి వచ్చిన ఈ ట్రయాంగిల్ లవ్ అండ్ ఎమోషనల్ డ్రామా సినిమాకు సెన్సార్ బోర్డ్ షాక్ ఇస్తూ 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ నిర్ణయంపై హీరో షాహిద్ కపూర్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ముచ్చటిస్తూ తీవ్ర అసంతృప్తి, ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సెన్సార్ సర్టిఫికెట్‌పై షాహిద్ ఓపెన్‌గా స్పందిస్తూ.. "ఈ సినిమాలో ఎలాంటి అభ్యంతరకరమైన, అసభ్యకరమైన లేదా బోల్డ్ సీన్స్ అస్సలు లేవు. సినిమా మొత్తంలో అలాంటి ఒక్క సన్నివేశం కూడా మీకు కనిపించదు. ఇదొక పక్కా ఫ్యామిలీ ఓరియెంటెడ్ ఎమోషనల్ డ్రామా. మరి ఇలాంటి క్లీన్ చిత్రానికి సెన్సార్ వాళ్లు 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదు. ఎంత ఆలోచించినా లాజిక్ దొరకట్లేదు. ఇది ముగ్గురు వ్యక్తుల జీవితాల చుట్టూ తిరిగే కథ. కుటుంబ సమేతంగా థియేటర్లకు వచ్చి హ్యాపీగా నవ్వుకుంటూ చూసే సినిమా" అని చెప్పారు. మరోవైపు, టాక్‌తో సంబంధం లేకుండా ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ రాబట్టింది. మొదటి రోజే వరల్డ్ వైడ్‌గా దాదాపు రూ. 13 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా అనౌన్స్ చేసింది. ఈ వీకెండ్‌లో కలెక్షన్స్ రేంజ్ ఇంకా పెరిగే ఛాన్స్ ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# 'మా ఇంటి బంగారం'కు మంచి ఓపెనింగ్స్..

## మహిళా ప్రేక్షకులకు సమంత థ్యాంక్స్



సమంత ప్రధాన పాత్రలో నటించి, స్వయంగా నిర్మించిన చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. విడుదలైన తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రూ. 13.15 కోట్ల గ్రాస్ వసూలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ భారీ విజయం పట్ల సమంత ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సినిమా ఓపెనింగ్స్‌కు మహిళా ప్రేక్షకులు భారీగా తరలిరావడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయంపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఒక నోట్ రాశారు. "మొదటి రోజు ఒక సినిమాకు ఇంత మంచి ఓపెనింగ్ రావడం చాలా ఆనందంగా ఉంది. యువత నుంచి పెద్దల వరకు అందరూ సినిమాను ఆశీర్వదించడానికి రావడం గొప్ప అనుభూతినిచ్చింది" అని ఆమె పేర్కొన్నారు. "థియేటర్లకు ఓపెనింగ్స్‌ను మగ ప్రేక్షకులే తెస్తారని చాలాకాలంగా వింటున్నాం. కానీ, ఈ సినిమాకు మహిళలు భారీగా తరలిరావడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. సినిమా ప్రేక్షకులు కూడా ఎదుగుతున్నారని అర్థమవుతోంది. మా చిన్న ప్రొడక్షన్ హౌస్ విజయం సాధించింది" అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు. ఇటీవలే ఓ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. 'మా ఇంటి బంగారం'లోని స్వర్ణ పాత్ర తన నిజ జీవితానికి చాలా దగ్గరగా ఉంటుందని సమంత తెలిపారు. తాను ఇప్పటివరకు చేసిన తెలుగు పాత్రలన్నింటిలో ఇదే తనకు అత్యంత ఇష్టమైనదని చెప్పారు. చిత్రంలోని యాక్షన్ సన్నివేశాల గురించి మాట్లాడుతూ.. "సినిమాలో స్లో మోషన్ షాట్లు, బిల్డప్ షాట్లు ఉండవు. నిజమైన పంచ్‌లు ఉంటాయి. నాకు కూడా దెబ్బలు తగిలాయి, రక్తం వచ్చింది. అన్ని యాక్షన్ సీన్లను నేనే స్వయంగా చేశాను. అందుకే అవి అంత సహజంగా కనిపిస్తున్నాయి" అని సమంత వెల్లడించారు.







